"నువ్వు మరీ ఇంత పిరికివాడివనుకోలేదు- పరిస్థితి అక్కడిదాకావస్తే ఊరికే భుజం పట్టుకొని ఒక్క క్షణం ఊపేసి వస్తావా? చూసిన వాళ్ళంటే తెలిసింది- నువ్వు రుద్రుడిలా ఆ అమ్మాయి మీదకు వెళ్ళినా, ఆ అమ్మాయి చీమకుట్టినంతయినా రియాక్టు కాలేదట. అవ్వ ..... అంత అవమానమా? నువ్వెలా తలెత్తుకు తిరగగలవు?"

మూర్తి తనకున్న జాకాల్ ఇంటెలిజెన్స్‌ని ఉపయోగిస్తూ, మధుకర్‌లో చల్లారిపోతున్న పగ, ప్రతీకారాలకు తిరిగి ఊపిరిపోయసాగాడు.

"అవును - నిజమే - అంత మీదకెళ్ళినా, మహతి లేశ మాత్రమైనా బెదరలేదు. ఏమిటావిడ ధైర్యం?" స్వగతంలో అనుకున్నా, ఆ మాటలు మూర్తికి వినిపించాయి.

"అదే కదా నేనూ మొత్తుకునేది. నువ్వేం చేసినా, నిన్నేమయినా చేయగలిగేవాడు ఈ నగరంలో ఉన్నాడా? లేడు. అలా అని ఆ అమ్మాయికీ తెలుసు. తెలిసే అలా చేసిందంటే- ఏమిటావిడకున్న ఒత్తాసు? అండ? బలం? బలగం?" మూర్తి అగ్గిమీద గుగ్గిలాన్ని ఉండుండి చల్లుతున్నాడు.

" నిజమే ఏమీ చేయకుండా వచ్చానేమిటి?

నేనేదయినా చేస్తే- ఏమయిపోతుంది? పరువు దక్కుతుందా? ఇంకెవరైనా పెళ్ళి చేసుకుంటారా?"

"లేదు, బుద్ధున్నవాడెవడూ చేసుకోడు- అయినా అందరిలో బార్ కొనిపించి, వెర్రి వెంగళప్పను చేయించింది నేనే అని చెప్పటం, మితిమీరిన ఆమెలోని పొగరుబోతుతనానికి నిదర్శనం ..... " మూర్తి లాంటి వ్యక్తులకు గుగ్గిలం కరువు ఎప్పుడు ఉండదు. చల్లబడిన పగ, ప్రతీకారం, అవమానభారం తిరిగి మధుకర్‌లో రెట్టించిన వేగంతో ఊపిరిపోసుకోసాగాయి.

"ఆ ..... ఏం లేదు మితిమీరిన అహంభావం. అంతా కలిపినా ఆమె కున్న ఆస్తులు యాభైలక్షలకు దాటవు. మరి నీకో? ఐదొందల కోట్లు ..... ఒకటా-రెండా ఐదొందల కోట్లు. మరి నీకెంత అహం ఉండాలి? ఆ చెప్పు? మూర్తి రెచ్చగొడుతూ మధుకర్ మొఖంలోకే చూస్తూ, అప్పుడతని మొఖంలో మారే భావాల తీవ్రతను గమనిస్తూ ఆనందిస్తున్నాడు.

పచ్చగడ్డిని నిప్పు లేకుండానే భగ్గుమనిపించటం, వసుధైక కుటుంబంలో చిచ్చుపెట్టడం, పచ్చగావున్న ప్రాంతాన్ని సైబీరియా ఎడారిలా మార్చటం, ఎవ్వరినీ మనశ్శాంతిగా ఉండనివ్వకపోవటం, సుఖసంతోషాలతో కొనసాగనివ్వకపోవటం లాంటివి ఈ సమాజంలో కొంతమందికి గొప్ప ఆనందాన్ని, ఆత్మ సంతృప్తిని కలిగిస్తాయి. వీరికి వేరే ధ్యేయం వుండదు, లక్ష్యం వుండదు. పై కార్యక్రమాలే వారికి ఊపిరి. నేరస్తుల కన్నా, గుండాలకన్నా, వీరి మూలంగానే వ్యక్తులకు, సంస్థలకు, సమాజానికి, దేశానికి కీడు. అదిగో అలాంటి వర్గానికి చెందినవాడే మూర్తి.

మూర్తిలో ఒక గుంటనక్క, ఒక జాకాల్, ఒక తోడేలు, క్యారియన్ ఏనిమల్స్ లక్షణాలన్నీ పుష్కలంగా ఊపిరి పోసుకునున్నాయి.

"ఏదో చేయాలి? ఏం చేయాలి?" మంచి చెడుల మీమాంస మధుకర్‌లో.

పాప పుణ్యాల ఊగిసలాట మధుకర్‌లో --

"చెప్పానుగా -- కన్యాత్వం వున్న, అదే-- వర్జినిటీ వున్న యువతితో అహంభావం పాళ్ళే ఎక్కువగా వుంటుంది. దాన్ని త్రుంచేస్తే- కృంగిపోవటం, మథనపడటం, ప్రపంచాన్ని చూడటానికి భయపడటం లాంటి మానసిక రుగ్మతలు మొదలవుతాయి. అప్పుడిక మరొకర్ని చేసుకొనే ప్రయత్నం కూడా చేయదు. అదేకదా నీకూ కావల్సింది--" మంట తగ్గుతున్నప్పుడల్లా కొద్దిగా గుగ్గిలం, ఆ పైన కొన్ని ఎండుకట్టెలు.

మంట రగులుతూనే వుంటుంది.

ఆ మంట ముందుకు అరచేతుల్ని చాపి మూర్తిలాంటి వాళ్ళు చలికాగుతూనే వుంటారు.

ఒక స్థిరమైన నిర్ణయానికి రావటానికి మధుకర్‌కి కొంత సమయం పడుతుంది. ఒకింత మెంటల్ ప్రిపరేషన్ ద్వారానే చెడ్డ పనికి మన స్ఫూర్తిగా సిద్ధపడతాడు.

ఒకసారి ఆ నిర్ణయానికి వస్తే, ఇకతన్ని ఎవరూ ఆపలేరు.

మొండితనం, పౌరుషం, ఉక్రోషం, ఆత్మాభిమానం , ఆ పైన ఒకింత మూర్కత్వం కూడా కలిసి మధుకర్‌గా రూపాంతరం చెందాయి.

అది మూర్తికి బాగా తెలుసు. ఎండిన బీడుకి నిప్పు ఎవరయినా పెట్టగలరు. తడిసిన పచ్చగడ్డికి నిప్పు పెట్టటమే ఒకింత కష్టం.

అది రగులుతుంటే మాత్రం ఇక ఆగదు. తనకు తెలిసిన విద్యది. మరి దాని ద్వారానే గదా- తను బ్రతకాలి ..... ఇదీ మూర్తి కాన్సెప్ట్.

*    *    *    *

రాజేంద్ర ప్రసాద్  హాల్లో పచార్లు చేస్తున్నాడు.

హాలంతా నిశ్శబ్దంగా వుంది.

ఆయన గంభీరంగా వున్నాడు.

ఎదురుగా సోఫాలో మహతి కూర్చుని, తల వంచుకుని వుంది. మరో సోఫాలో ఆయన భార్య అదే స్థితిలో వుంది.

“నీకో కథ చెబుతాను శ్రద్ధగా విను” అని, కొద్ది క్షణాలు మౌనంగా ఉండి తిరిగి చెప్పటం ప్రారంభించారాయన.

“కొన్ని వేల సంవత్సరాల క్రితం మాట. ఒక శిల్పి ఉండేవాడట. మహాద్భుతమైన శిల్పి అతను. అతను చెక్కే శిల్పాలను చూసి బ్రహ్మ దేవుడే అశ్చర్యపోయేవాడట. సృష్టికర్తకే దిగులు తెప్పించే ఆ గొప్ప సృజనాత్మకత వున్న శిల్పి అతను. ప్రపంచ ప్రజలు అబ్బురపడే ఎన్నో అద్భుత విగ్రహాలను, గుళ్ళను, గోపురాలను ఆయన జీవిత కాలంలో మలిచాడట అయినా కాలం అతనిపై తన ప్రభావాన్ని చూపించక ఊరుకోదు కదా ..... చూపించింది ..... వృద్ధాప్యం వచ్చేసింది.

ఒక రోజు ఒక గొప్ప జ్యోతిష్కుడు శిల్పివద్దకు వేరే పనిమీద వచ్చి తన పని పూర్తి చేసుకొని వెళ్ళిపోతూ-- త్వరలో నీ కోసం యమపాశాన్ని తీసుకొని కింకరులు రాబోతున్నారని, పుణ్యకార్యాలు ఏమైనా చేసేదుంటే చేయమని, దైవస్మరణ చేసుకుంటూ ఆఖరిరోజుల్ని గడపమని చెప్పి వెళ్ళిపోయాడట.

దాంతో శిల్పి కలవరపడ్డాడు.

తను చెక్కవలసి వున్న మరో  అద్భుత శిల్పం మిగిలిపోయి వుందట, దాన్ని పూర్తిచేయటానికి కనీసం ఆరునెలలయినా పడుతుందట, దాంతో ఆ శిల్పి ఒక రాత్రంతా ఆలోచించి ఒక నిర్ణయానికొచ్చాడట.

ఎలాగయినా మృత్యుదేవతని మోసం చేయాలి. యముడ్ని మట్టిగరిపించాలి. ఎలా? అందుకే అచ్చం తనలాగే వుండే విగ్రహాల్ని రాత్రింబవళ్ళు నిద్రాహారాలు మాని చేయటం మొదలెట్టాడు.

కాలం క్రమంగా కరిగిపోతోంది. హీ ఈజ్ కౌంటింగ్ హిజ్ లాస్ట్ డేస్ అని భ్రమపడకూడదు. తన అద్భుత శిల్పచాతుర్యంతో తన జీవితకాలాన్ని పొడిగించుకుంటున్నాననే పూర్తి నమ్మకంతోనే అతనున్నాడు.

నిద్రాహారాలు మాని, ఏకదీక్షతో ఆరు విగ్రహాల్ని తయారు చేశాడు. చివరిగా వాటికేసి చూసి, తనని అద్దంలో సరిపోల్చుకుని సంతృప్తిపడ్డాడట.

ఆ రాత్రి జ్యోతిష్కుడు మరలా శిల్పి వద్దకు వచ్చాడట..

'నీ ఘడియలు దగ్గరపడ్డాయి. దైవస్మరణ చేసుకో' అని చెప్పి ఒకింతబాధపడ్డాడు.

అందుకా శిల్పి నవ్వి-' భలేవారే, యముడు నా విషయంలో పొరబడబోతున్నాడు చూడండి' అని అన్నాడట.

జ్యోతిష్కుడుకేం అర్థంకాలేదు.

అదెలా సంభవమని ఆశ్చర్యపడుతుండగానే, శిల్పి జ్యోతిష్కుడ్ని కాసేపు ఆగి లోపలకు రమ్మని చెప్పి, తను ముందుగానే లోపల గదిలోకి వెళ్ళిపోయాడట.

కాసేపాగి జ్యోతిష్కుడు లోపలకు వెళ్ళి అక్కడ కనిపించిన దృశ్యాన్ని చూసి షాక్ తిన్నాడట. అక్కడ ఏడు విగ్రహాలు వరుసగా నిలబడి వున్నాయి. అవి అచ్చం

ఒకలాగే వున్నాయి. అందులో ఒకరు శిల్పి. కాని ఎంత పరీక్షగా చూసినా, ఎంత బుర్ర బ్రద్దలుచేసుకున్నా, జ్యోతిష్కుడికి అసలు శిల్పి ఎవరన్నది అర్థంకాలేదు.

అలా హ్యోతిష్కుడు పిచ్చిపట్టి చూస్తుండగా, అంతలో నలుగురు యమకింకరులు చేతుల్లో యమపాశాన్ని తీసుకొని ఆ గదిలోకి వచ్చారట.

వాళ్ళకి అదే పరిస్థితి ఎదురయి, ప్రక్కనే వున్న జ్యోతిష్కుడ్ని అడిగారట- అందులో శిల్పి ఎవరని.

జ్యోతిష్కుడు పెదవి విరిచాడట. కింకరులు ఎన్ని రకాలుగా చూసినా, ఎంత పరీక్షగా చూసినా, అసలు శిల్పిని కనుగొనలేక పోయారట.

ఒకర్ని తీసుకెళ్ళబోయి మరొకర్ని తీసుకెళితే- తమ ఉద్యోగాలకు ముప్పు వస్తుందని భయపడి, రిక్తహస్తాలతో వెనుదిరిగి వెళ్ళిపోయారట.

జ్యోతిష్కుడికి పిచ్చిపట్టినట్లయి ముందు హాల్లోకి వెళ్ళి జ్యోతిష్య శాస్త్రాన్ని తిరగవేయసాగడట.

అంతలో లోపలనుంచి శిల్పి వచ్చి, 'చూసావా నా చాతుర్యం' అని నవ్వారట.

జ్యోతిష్కుడు దిగ్భ్రాంతినుంచి తేరుకొని 'ముక్కోటి దేవతల్ని నీవు మోసం చేయగలవేమోగానీ మృత్యువుకి ప్రతినిధి అయిన యముడ్ని మోసం చేయలేవు చూడు' అన్నాడట.

శిల్పి నవ్వి సరే చూద్దాం అని తిరిగి లోపలకు వెళ్ళాడట.

జ్యోతిష్కుడు -- శిల్పి తిథి నక్షత్రాల్ని గ్రహాల్ని చూసి మృత్యువు ఆ రాత్రికి అతన్ని వరించవలసి వుందే అని విస్మయపడ్డరట.

ఇక్కడిలా వుండగా యమకింకరులు యమలోకానికి వెళ్ళి జరిగింది యముడికి చెప్పారట.

యముడు కింకరుల్ని మందలించి, చిత్రగుప్తుడ్ని తీసుకెళ్ళి అతని ప్రాణాల్ని తీసుకురమ్మని అజ్ఞాపించాడట.

ఈసారి కింకరులు చిత్రగుప్తుడ్ని వెంటబెట్టుకొని తిరిగి శిల్పి ఇంటికి వచ్చారట.

చిత్రగుప్తుడు కూడా పిచ్చెత్తిపోయి జ్యోతిష్కుడ్ని బ్రతిమిలాడాడట అసలు శిల్పిని చూపించమని.

జ్యోతిష్కుడు మునుపటిలాగే తన అశక్తతను వెలిబుచ్చాడట.

కొన్ని ఘడియలపాటు ప్రయత్నించి చిత్రగుప్తుడు చేతులెత్తేశాడట.

ఆ పైన కింకరులు, చిత్రగుప్తుడు తిరిగి రిక్తహస్తాలతో యమలోకం వెళ్ళిపోయారట.

జ్యోతిష్కుడు, కింకరులు, చిత్రగుప్తుడు ఆ శిల్పి నైపుణ్యానికి జోహార్లు అర్పించారే తప్ప, తమ వృత్తి ధర్మాన్ని నిర్వ ర్తించలేక పోయారు.

అంతలో లోపలనుంచి శిల్పి బయటకువచ్చి యిప్పుడేమంటావ్ అని అడిగాడట.

నువ్వొక మహాద్భుతమైన శిల్పివే. కాదనలేదు. ఎవ్వరూ అనలేరు కూడా, కానీ మృత్యువుకి ప్రతిభతో సంబంధం-కులమతాలతో అంతకంటే సంబంధం-లేదు.

శిల్పిగా నువ్వెంత గొప్పవాడివో, జ్యోతిష్కుడిగా నేనూ అంత గొప్పవాడినే. నాకు తెలిసినంతవరకు ఈ రాత్రి ఝాము ముగిసేలోపే నీకు మృత్యువుతోడవుతుంది. అది యముడి శిలాశాసనం. అది తిరగబడటం అంటే-- విశ్వవ్యాపిత దైవశాసనాలన్నీ తిరగరాయబడవలసిందే. అదెలా సాధ్యం? అని గొణిగాడట. అప్పటికే జ్యోతిష్కుడి మొఖంలో-- తను, తన శాస్త్రం శిల్పి ముందు ఓడిపోయిన భావాన్ని వ్య క్తపర్చాడు. తన ఓటమిని ఒప్పుకున్నాడు కూడా.

“మీరనుకొనే శాస్త్రాలన్ని నా ద్వారానే తిరగరాయబడతాయి చూస్తుండండి. ఇక మిగిలింది యముడేకదా ..... ఆయనా నా ముందు ఓడిపోవలసిందే” అని అన్నాడట.

జ్యోతిష్కుడు తల వంచుకున్నాడు.

ఇదిలా వుండగా అక్కడ యముడు -- కింకరులమీద, చిత్ర గుప్తుడి మీద విరుచుకుపడ్డాడట. ఎవరు నిజమో, ఎవరు నకిలీ తెలీని మీరు దద్దమ్మలు అనీ యింకా అదీ, ఇదీ తెగతిట్టిపోశాడట.

మీరే ప్రయత్నించరాదా అని చిత్రగుప్తుడు గొణిగాడట.

చివరకు యముడే యమపాశం తీసుకొని బయలుదేరి శిల్పి ఇంటికి వెళ్ళాడట.

వెళ్ళగానే ముందుగా జ్యోతిష్కుడు ముందు హాల్లో కనిపించాడట.

ఏమిటి విషయం అని యముడు జ్యోతిష్కుడ్ని వివరాలలోకి దింపాడట.

అతనో పెద్ద అహంభావి. ఎవరిమాటా వినడు. దైవశాసనాల్ని కూడా ధిక్కరించేంత అహంభావి. ‘మీకైనా, మరెవరికైనా ఆ ఏడుగురిలో ఎవరు శిల్పి, విగ్రహాలు ఏవన్నది కనిపెట్టటం కష్టం’ అని వాపోయాడట.

యముడు తల పంకించి, కొద్దిక్షణాలు యోచించి, లోపలకు వెళ్ళి ఏడు విగ్రహాల్ని చూసి-- ఆహా ..... ఏమీ శిల్పి చాతుర్యం ..... అచ్చం తన లాగే ఆరు శిల్పాల్ని చేసి మృత్యువునే సందిగ్ధంలో పడవేశాడే. ఈ శిల్పికి నా ప్రణామాలు. మయుడంతటి శిల్పి ఈయన. మయుడి శిష్యుడేమో అని అన్నాడట.

ఆ వెంటనే శిల్పి కోపంగా- మయుడెక్కడ, నేనెక్కడ. మయుడు నా ముందు బచ్చా తెలిసి మాట్లాడు యముడా- అని అన్నాడట.

రెడీగా వున్న యముడు, శిల్పి మీదకు యమపాశాన్ని వదిలాడట. అంతే శిల్పి మృత్యువు పాలయ్యాడు” రాజేంద్ర ప్రసాద్ చెప్పటం కొద్దిక్షణాలు ఆపి తిరిగి

అన్నాడు-- “చూశావా ..... మనిషికి అహం ఎంతచేటు తెస్తుందో ..... మనం ది గ్రేట్ ఇండస్ట్రియల్ ఎంపరర్ రాఘువేంద్ర నాయుడి ముందు ఎంత? ఆ రాఘువేంద్ర నాయుడికి ఆయన కొడుకంటే ప్రాణమట. నువ్వదేపనిగా మధుకర్ ని రెచ్చగొడితే అది అతనితో పోదు. పెద్దాయనవరకూ వెళుతుంది. ఆ తరువాత మనం మనగలగటం చాలా కష్టం. ఇంతకంటే చెప్పేదేంలేదు. జాగ్రత్త” అని మృదువుగా కూతురు మహతిని హెచ్చరించి బయటకు వెళ్లిపోయాడు.

“కథ చాలా బావుంది-అంతే. కాని యిది జీవితం” అని చిన్నగా నవ్వుతూ అంది మహతి తనూ లేస్తూ, మహతి తల్లి దిగ్భ్రాంతికి గురయింది.

* * * *

“ఏంటాలోచిస్తున్నావ్ ..... నా ఉద్దేశంలో థింకింగ్ ఈజ్ ది నాన్సెన్స్ థింగ్ ఇన్ ది వరల్డ్..... అందువల్ల నేనరేంజ్ చేస్తాను ..... నువ్వు వూ అను ” మరో పెగ్గులోనికెళ్ళింది.

మధుకర్ నరాలనిండా ఏదో తెలీని కసి. ఆ కసిని అగ్గిపుల్లతో కాకుండా పెట్రోల్ వేసి రెట్టింపు చేస్తున్నాడు మూర్తి.

“భయపడుతున్నావా?” హేళన చేస్తున్నట్లుగా నవ్వాడు మూర్తి.

“నో ..... నో ” ముద్దగా అన్నాడు మధుకర్.

“మరి ..... డోంట్ థింక్ ఐ సే. ఇవాళ రాత్రి పదిగంటలలోపు నువ్వు మహతిని అనుభవిస్తావ్” చాలెంజ్ చేస్తున్నట్లుగా అన్నాడు మూర్తి.

మూర్తి తలచుకుంటే ఏమైనా చెయ్యగలడు.

“ఎక్కడ, ఎలా” ఆ రెండు మాటలూ మధుకర్ నోటి నుంచి వచ్చాయి.

“అదే సస్పెన్స్ ..... ఐదు వేల రూపాయలిలాతే ..... నువ్విక్కడే వుండు ..... సరిగ్గా ఇంకో గంట తర్వాత ఎక్కడో, ఎలాగో చెబుతాను.” లేస్తూ అన్నాడు మూర్తి.
“రూపాయలెందుకు ” ఎప్పుడూ అలాంటి ప్రశ్నలు వెయ్యడు మధుకర్. మహతి విషయంలో మాత్రం అన్నీ ప్రశ్నలతోటే అతని ఆరా మొదలవుతుంది.

"బజ్జీలు కొనుక్కోవడానికి " మధుకర్ ఇచ్చిన డబ్బందుకుంటూ అన్నాడు మూర్తి.

కొద్దిక్షణాలాగి "చూడు మధూ, ఎక్కువ తాగకు. ఆరోగ్యం పాడవుతుంది" అని సలహా ఇచ్చి బయటికెళ్ళిపోయాడు మూర్తి. హుషారుగా.

మధుకర్‌కి చాలా థ్రిల్లింగ్‌గా ఉంది.

గ్లాసులో మిలమిలా మెరుస్తున్న ఎరుపురంగు ద్రవంలో మహతి ముఖం కన్పించినట్టయింది. జరిగిన అవమానానికి తగిన ప్రతీకారం ఒక పథకం రూపంలో ఊపిరి పోసుకొంటోంది క్రమంగా.

మహతి నిజంగా సౌందర్యవీణ.

ఎప్పుడూ బిజీగావుండే బ్రహ్మదేవుడు, హాలీడేనాడు తీరుబడిగా వెన్నెల్లోని చల్లనికాంతినీ, మబ్బుల్లోని మెత్తని లాలిత్యాన్నీ, పారిజాత పువ్వుల్లోని సుగంధభరిత పరిమళాన్నీ, పారే నది కెరటాల గమ్మత్తయిన నడకనీ, సృష్టిలోని వింత అందాలన్నింటినీ కలబోసి, కాచి, తుచి, చేసిన అద్భుత సౌందర్యదేవత మహతి!

మహతిని ఎలా తెస్తాడు మూర్తి? కిడ్నాప్ చేస్తాడా? బెదిరిస్తాడా? మూర్తి ట్రాప్‌లో మహతి పడుతుందా? ఐదువేల రూపాయల కోసం మూర్తి తనకి మస్కాకొట్టాడా?

సిగరెట్ పొగను రింగురింగులుగా వదులుతూ ఆలోచిస్తున్నాడు మధుకర్ .

ఆ సమయంలో ఓపెన్ స్ట్రీట్ బార్‌లో జనం పలచగా వున్నారు. లైట్‌గా గాల్లో సుడులు తిరుగుతున్న మడోనా విరహపు గొంతులోని వయ్యారం "కిస్ మీ, కిల్ మీ" అంటూ మధుకర్‌ని మరింతగా మత్తెక్కిస్తోంది. నరాల్లోకి నిషా నెమ్మదిగా ప్రవహిస్తోంది కరెంట్‌లా!

*　　　*　　　*　　　*